
సాక్షి పల్నాడు

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 2212 క్యూసెక్కులు విడుదల చేశారు. పలు కాలువలకు 2105 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.4867 టీఎంసీలు ఉంది. ఎగువ నుంచి 2000క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

నేడు వేదవ్యాసభగవానుని విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం



అమరావతి: వేద వ్యాస భగవానుని దేవాలయ శిఖర కుంభాభిషేకం, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైకుంఠపురం భవఘ్ని ఆరామంలో బుధవారం ఘనంగా నిర్వహించటానికి భారీగా ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ ప్రతిష్ఠా మహోత్సవాలలో భాగంగా మంగళవారం భవఘ్నిగురూజీ దంపతుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠా మూర్తులకు విశేష నవకలశ ద్రవ్యస్నపన పంచగవ్యస్నపనము, గంధాధివాసం, అధివాసాంగ హోమాలు నిర్వహించారు. వేదవ్యాస భగవానుని విగ్రహానికి బుధవారం ఉదయం 9.23 గంటలకు యంత్రప్రతిష్ఠ, బింబ ప్రతిష్ఠ, కళాన్యాసం, మహాపూర్ణాహుతి, మూలాలయం, గోపుర, పరివారదే వతలకు కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు భవఘ్ని గురూజీ తెలిపారు. ప్రతిష్ఠామహోత్సవానికి వచ్చే వాహనాలకు గ్రామానికి రెండువైపులా పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు అమరావతి ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు. అమరావతి, గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలను ఆర్‌సీఎం చర్చి దగ్గర, విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలను కరకట్ట మీదుగా ఇసుకరీచ్ వద్ద పార్కింగ్ చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సుమారు వందల మంది పోలీస్ సిబ్బందితో బందోబస్త్ ఏర్పాటు చేశామన్నారు.

ఇంటివద్దకే రేషన్ బియ్యం పంపిణీ


నరసరావుపేట: ఫిబ్రవరి మాసానికి సంబంధించిన రేషన్‌బియ్యం, నిత్యావసరాలు ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు బుధవారం ఉదయం ఏడుగంటల నుంచే ఇంటివద్దకే వచ్చి పంపిణీ చేయటం జరుగుతుందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.మోహన్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సార్టెక్స్ తెలుపురంగు బియ్యం ఒక్కొక్కరికి ఐదు కేజీల చొప్పున, ఏఏవై కార్డుకు 35 కేజీల చొప్పున ఉచితంగా పంపిణీ చేయబడతాయన్నారు. కందిపప్పు తెలుపురంగు కార్డుదారులు, ఏఏవై కార్డుదారులకు ఒక్కింటికి కిలో చొప్పున, పంచదార తెలుపు రంగు కార్డుదారులకు అరకేజీ, ఏఏవై కార్డుదారునికి ఒక కేజీ పంపిణీ చేస్తారన్నారు. బియ్యం ఉచితంగాను, పంచదార, కందిపప్పును నిర్ణీత ధరలకు పొందాలని అన్నారు. కార్డుదారులు బియ్యం, ఇతర నిత్యావసరాలు ఎవరికైనా విక్రయిస్తే కార్డు రద్దుచేస్తామని హెచ్చరించారు. కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జెడ్పీ సీఈవోగా మోహనరావు బాధ్యతల స్వీకారం



గుంటూరుఎడ్యుకేషన్: జెడ్పీ సీఈవోగా జె.మోహనరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు డీఎల్‌డీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మోహనరావును జెడ్పీ డిప్యూటీ సీఈవోగా నియమించిన ప్రభుత్వం సీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలను ఆయనకే అప్పగించింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఈవో ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించిన తరువాత సీఈవో (ఎఫ్‌ఏసీ)గా బాధ్యతలు చేపట్టారు. మోహనరావు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ దంపతులను జెడ్పీ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మోహనరావుకు జెడ్పీ పరిపాలనాధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 567.20 అడుగుల వద్ద ఉంది. ఇది 249.5490 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 9,387, ఎడమకాలువకు 8,193, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 9,288, ఎస్‌ఎల్‌బీసీకి 2,400, వరదకాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 29,588 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 19,628 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 839.50 అడుగుల వద్ద ఉంది. ఇది 61.0654 టీఎంసీలకు సమానం.



గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో నిక్ వుజిసిక్ ప్రసంగం వినేందుకు తరలివచ్చిన విద్యార్థిలోకం



ప్రసంగిస్తున్న నిక్ వుజిసిక్

గెలుపు మంత్రం

విద్యార్థి లోకానికి స్ఫూర్తి నింపిన అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్

- సానుకూల దృక్పథంలోనే విజయం దాగి ఉంది
- లేనివి తలచుకుని కృంగిపోకండి ఉన్నవి చూసుకుని ఆనందించండి
- నా వైకల్యం ఎందరికో స్ఫూర్తినిచ్చినందుకు గర్విస్తున్నా
- కలల సాకారానికి కృషి చేస్తే ఎలాన్‌మస్క్ కంటే ఉన్నతంగా ఎదుగుతారు
- డబ్బుతో సాధించలేనివి కూడా ప్రేమ, మన్నింపు, ధైర్యంతో సాధ్యమే

ఏఎన్‌యూ: జీవితంలో అసాధ్యం అంటూ ఏమీ లేదని అంతా సాధ్యమేనని అంగవైకల్యం, అవరోధాలు ఉన్నత లక్ష్య సాధనకు అడ్డుకాదని అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ అన్నారు. గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో మంగళవారం సాయంత్రం నిక్ విద్యార్థులకు ప్రేరణ ప్రసంగం చేశారు. సానుకూల దృక్పథంలోనే జీవిత విజయం దాగి ఉందన్నారు. నిన్ను నిందించిన వారిని తిరిగి నిందించవద్దని వారికి ప్రేమను పంచమని విద్యార్థులకు సూచించారు. మనకు లేనివి తలచుకుని కృంగిపోవద్దని, ఉన్నవి చూసుకుని ఆనందించాలని సూచించారు. నా అంగ వైకల్యం తలచుకుని నేనెపుడూ బాధపడనని ప్రతి రోజూ ఉదయం అద్దంలో నా అందమైన ముఖం, కళ్లు చూసుకుని ఆనందపడతానని, అవే నాకు ఎంతో స్ఫూర్తినిస్తాయన్నారు. నా వైకల్యం ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచినందుకు గర్విస్తున్నా అన్నారు. భారతదేశం ఎంతో సామర్థ్యం ఉన్న దేశమని మీరు అనుకుంటే ఏదైనా సాధించగలుగుతారన్నారు. భారతీయ యువకులకు ఉత్తమ పారిశ్రామికవేత్తలుగా ఎదిగే నైపుణ్య లక్షణాలు ఉన్నాయన్నారు. మీ కలల సాకారానికి అంకితభావంతో కృషిచేస్తే ఎలాన్‌మస్క్‌కంటే ఉన్నతంగా ఎదిగే శక్తి సామర్థ్యాలు మీలో ఉన్నాయని అన్నారు. ఇది సాధించలేనేమో అనే భయం, సందేహాలకు జీవితంలో తావివ్వొద్దని సూచించారు. డబ్బుతో సాధించలేనివి ఎన్నో ప్రేమ, మన్నింపు, ధైర్యంతో సాధించవచ్చని అన్నారు. 3,500లకుపైగా ప్రసంగాలు చేశానని, ప్రసంగించడం జీవితంలో నా కు దక్కిన గొప్ప అదృష్టంగా భావిస్తున్నానన్నారు.



నిక్ వుజిసిక్‌తో సీఎం సలహాదారు ధనుంజయరెడ్డి, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి

విద్యార్థుల నినాదాలతో హోరెత్తిన ప్రాంగణం

నిక్ ప్రసంగంతో విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. విద్యార్థుల నినాదాలు, చప్పట్లతో బ్రహ్మానందరెడ్డి స్టేడియం ప్రాంగణం మారుమోగింది. చాలా సందర్భాల్లో నిక్ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు ఆనందంగా సమాధానం ఇచ్చారు. ప్రతి ఒక్కరిని ప్రేమిస్తానని, గౌరవిస్తామంటూ విద్యార్థులతో నిక్ ప్రతిజ్ఞ చేయించారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఫాతిమా తదితరులు హాజరయ్యారు.



నిక్ వుజిసిక్‌కు స్వాగతం పలుకుతున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్

ముఖ్యమంత్రిపై ప్రశంసలు

తన ప్రసంగంలో నిక్ ఆంధ్రప్రదేశ్‌పైన, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపైన ప్రశంసలు కురిపించారు. విద్య, విజ్ఞానానికి సీఎం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇది ఎంతో మంచి పరిణామమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది ప్రముఖులను ఇప్పటి వరకు కలిశానని, కానీ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో కలవబోవడం తన జీవితంలో ఎంతో ప్రత్యేకమన్నారు. ఎంతో అంకితభావం ఉన్న ప్రభుత్వం ఏపీలో ఉందని కితాబు ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా 78 దేశాల్లో పర్యటించా, కానీ ఎక్కడా పొందని ప్రత్యేక అనుభూతి ఇక్కడ పొందానన్నారు. ఏపీలో పదో తరగతిలో తన జీవితంపై పాఠ్యాంశం విద్యార్థులకు ఎంతో ప్రేరణనిస్తుందన్నారు.

కరుణామూర్తి కానుకమాత

- రాష్ట్రంలోనే అతి పెద్ద కానుకమాత దేవాలయం
- రేపు దేవాలయం తిరునాళ్ల

రెంటచింతల: కరుణ కల్గిన మాత కానుకమాత. కానుకమాతకు రెంటచింతలలో చలువరాయితో మందిరం నిర్మించారు. శిలువ వేసే సమయంలో క్రీస్తు పడిన పాట్లను గుర్తుచేసే 14స్థలాలు ప్రేమ, శాంతి, కరుణ, సహనానికి ప్రతీకలుగా నిలుస్తాయి. దాదాపు 5వేల మంది భక్తులు ఒకేసారి ప్రార్థన చేసుకునే సౌకర్యం ఉన్న అతిపెద్ద చలువరాతి క్రీస్తు దేవాలయం ఇది. దీనిని 1982 సంవత్సరంలో రూ.30లక్షల వ్యయంతో నిర్మించారు. ఇంతపెద్ద ఆలయం కేవలం రెండు పిల్లర్ల ఆధారంగా నిర్మించడం ఇక్కడ మరో విశేషం. రాష్ట్రంలోనే ప్రత్యేకస్థానం కలిగిన కానుకమాత దేవాలయం తిరునాళ్ల మహోత్సవం ఫిబ్రవరి 2న జరుపుకుంటారు. ఫాదర్ జోసఫ్ గ్రాండ్ నుంచి ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి వరకు 19 మంది విచారణ గురువులు ఇక్కడ క్రీస్తు బోధనలు చేస్తున్నారు. ప్రతి ఏటా కానుకమాత దేవాలయంలో జనవరి 24న జండాప్రతిష్ఠతో ప్రారంభమై ఫిబ్రవరి 1వరకు నవదిన ప్రార్థనలు జరుగుతాయి. ఫిబ్రవరి 2న కానుకమాత తిరునాళ్ల మహోత్సవం కనుల పండువగా జరుగుతుంది. వివిధ ప్రాంతాలలో ఉన్న గ్రామానికి చెందిన వారితోపాటు వారి బంధుమిత్రులు సైతం ఈ తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొంటారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన కానుకమాత చర్చి

తిరునాళ్ల రోజు కార్యక్రమాలు

ఫిబ్రవరి2న ఉదయం 5.30గంటలకు విచారణ గురువులు ఏరువ లూర్దుమర్రెడ్డి, సహాయ గురువులు పి.స్లీవారెడ్డి మొదటి దివ్యపూజాబలి, ఉదయం 9.30 గంటలకు తొలి తెలుగు కార్డినల్ పూల అంతోని వారిచే పండుగ పవిత్ర సమష్టి మహోత్సవ దివ్యపూజాబలి నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3గంటల నుంచి కొవ్వొత్తులు, కానుకల సమర్పణలో కులమతాలకతీతంగా అన్ని మతస్తులవారు తిరునాళ్ల రోజు కానుక మాత, ఏసుక్రీస్తు దీవెనలు పొంది కొవ్వొత్తులు సమర్పించి తమ జీవితాలలోను కొత్త వెలుగు నింపాలని ప్రార్థిస్తారు

తిరునాళ్ల ఏర్పాట్లు పూర్తి...

కానుకమాత చర్చి తిరునాళ్ల మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి తెలిపారు.

వైద్య రంగంలో పెద్ద ఎత్తున సంస్కరణలు

- ఔషధ నియంత్రణ శాఖకు నూతనంగా భవనాలు
- ఔషధాల కొరత లేకుండా నిల్వలు
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- గుంటూరులో ఔషధ నియంత్రణ కార్యాలయం ప్రారంభం

గుంటూరుమెడికల్: వైద్య రంగంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున సంస్కరణలు చేశారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో మొట్టమొదటిసారిగా ఔషధ నియంత్రణ, పరిపాలన శాఖకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నూతనంగా భవన నిర్మాణాలు ఏర్పాటు చేసేందుకు బడ్జెట్ ఇచ్చిందన్నారు. అందులో భాగంగా గుంటూరులో రూ.1.30 కోట్లతో నూతనంగా నిర్మించిన ఔషధ నియంత్రణ, పరిపాలన శాఖ ఉప సంచాలకులు కార్యాలయాన్ని ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. మంత్రి రజిని మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, ఇతర సేవలు పూర్తిగా ఉచితంగా అందేలా ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు, సచివాలయాలు ఏర్పాటుచేసిందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, టీచింగ్ ఆసుపత్రుల రూపురేఖలు మార్చి వేసిందన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది కొరత లేకుండా ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయడంతోపాటు, నూతనంగా పోస్టులను సైతం ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఒకేసారి 47వేలకు పైగా మెడికల్ డిపార్టుమెంట్‌ల్లో ఉద్యోగాల కల్పన చేసి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి రికార్డు సృష్టించారన్నారు. అధికారులంతా సమష్టిగా పనిచేసి మార్కెట్‌లో నకిలీ మందులు లేకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో దేశంలోనే ఏపీ ఆదర్శంగా నిలిచిందన్నారు. ఔషధ నియంత్రణ, పరిపాలన శాఖ డైరెక్టర్ జనరల్ ఎస్.రవిశంకర్‌నారాయణ్ మాట్లాడుతూ తమ శాఖ బలోపేతంలో భాగంగా భవనాలను నిర్మించిన సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాము, డిప్యూటీ మేయర్ షేక్ సజిల, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, డైరెక్టర్ ఎం.బి.ఆర్.ప్రసాద్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ డి.లక్ష్మణ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.వెంకటనాగపద్మ, జె.విజయలక్ష్మి, డ్రగ్గిస్ట్స్ అండ్ కెమిస్ట్స్ అసోసియేషన్ నేతలు రంగారావు, చంద్రశేఖరరావు పాల్గొన్నారు.



ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని, కృష్ణబాబు, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, ఎమ్మెల్యే మద్దాళి

పనిచేయని లిఫ్ట్, ఎస్కలేటర్‌లు



పని చేయని ఎస్కలేటర్

- వృద్ధులు, చిన్నారుల అవస్థలు
- చోద్యం చూస్తున్న డివిజన్ అధికారులు
- నెల రోజులుగా గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఇదే దుస్థితి

లక్ష్మీపురం: గుంటూరు రైల్వేస్టేషన్‌లో నెల రోజులుగా రెండు లిఫ్టులు, ఎస్కలేటర్‌లు పనిచేయడం లేదు. ప్రయాణికులు అసౌకర్యాన్ని గురవుతున్నా డివిజన్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... గుంటూరు రైల్వేస్టేషన్‌కు నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వేస్టేషన్‌లో వృద్ధులు, వికలాంగులు సౌకర్యార్థం లిఫ్ట్, ఎస్కలేటర్‌లు ఏర్పాటుచేశారు. నెల రోజులుగా ఇవి పని చేయడం లేదు. ఈ విషయం సంబంధిత స్టేషన్‌మాస్టర్ నుంచి డివిజన్ అధికారుల వరకు సమాచారం తెలియజేసినా పట్టించుకున్న నాథుడు లేరు. గత్యంతరం లేక వృద్ధులు, మోకాళ్ల నొప్పులతో బాధపడే వారు, వికలాంగులు మెట్లనే ఆశ్రయిస్తున్నారు. ప్లాట్‌ఫారంపై గత కొన్ని రోజులుగా పనులు జరుగుతున్నాయి. మట్టి కుప్పలు ప్లాట్‌ఫారంపై ఉండటంతో వృద్ధులు, చిన్నారుల, మహిళలు, వికలాంగులు అసౌకర్యానికి గురవుతున్నారు. రైలు వచ్చిన సమయంలో మాత్రమే ఎస్కలేటర్ పనిచేస్తుందని మామూలు సమయంలో నిలిపి వేస్తు ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా డివిజన్ అధికారులు స్పందించి సౌకర్యాలు కలిపించడంలో శ్రద్ధ వహించాలని కోరుతున్నారు.



గుంటూరు రైల్వేస్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై పనిచేయని లిఫ్ట్

రీసర్వే సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోండి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

పాత గుంటూరు: జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా జరిగేలా రెవెన్యూ డివిజన్, మండల రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షించి క్షేత్రస్థాయి సిబ్బందికి అవసరమైన సూచనలు అందించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్లు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వేకి సంబంధించి ఓఆర్ఐ మ్యాప్‌లు అందినప్పటి నుంచి నిర్దేశిత సమయంలో సక్రమంగా పూర్తి చేసి భూ హక్కు పత్రాలను సిద్ధం చేయాలని కోరారు శ్మశాన వాటికలకు కేటాయించిన స్థలాల రికార్డులను గ్రామ పంచాయతీలకు అందజేసి రెవెన్యూ రికార్డులలో అప్ డేట్ చేయాలన్నారు. రీ సర్వే ప్రారంభించనున్న గ్రామాల్లో క్షేత్ర స్థాయి భూ రికార్డుల స్వచ్ఛీకరణ, సాదాబైనామాల దరఖాస్తులు సక్రమంగా పరిష్కరించాలని పేర్కొన్నారు. గుర్తించిన మ్యుటేషన్లను సుమోటోగా సరిదిద్దాలన్నారు. రబీ ఈ క్రాప్ బుకింగ్‌కు సంబంధించి రెవెన్యూ అధికారులు ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ భవనాలకు స్థలాల కేటాయింపు, ఎంఐజీ లే అవుట్స్, డాటెడ్ ల్యాండ్, 22 ఏ కేసులు, ఈ ఆఫీస్, తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించి అధికారులకు సూచనలు జారీ చేసారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, జిల్లా రెవెన్యూ అధికారి కె. చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురికి యావజ్జీవం

ఒక్కొక్కరికీ రూ.5 వేలు జరిమానా

గుంటూరు లీగల్: కట్నం కోసం వేధించడమేగాక చివరకు హత్యకు పాల్పడిన నలుగురికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికీ రూ. 5 వేలు జరిమానా విధిస్తూ ఐదో అదనపు జిల్లా కోర్టు, ప్రత్యేక మహిళా న్యాయస్థానం ఇన్‌చార్జి జడ్జి, పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.సీతారామకృష్ణారావు మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం విజయవాడ చిట్టినగర్‌కు చెందిన దామర్ల హేమరాజు తన రెండో కుమార్తె శ్రీవర్ధనిని మంగళగిరికి చెందిన భట్టు శ్రీనివాసరావుకు ఇచ్చి 1996 నవంబర్‌లో వివాహం జరిపాడు. వివాహమైన ఏడాదికి వారికి ఒక బాబు పుట్టాడు. అనంతరం శ్రీనివాసరావు తాగుడికి బానిసై భార్యను అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించాడు. దీనికి శ్రీనివాసరావు తల్లిదండ్రులు భట్టు సామ్రాజ్యం, భట్టు వీర రాఘవయ్య, ఆడబిడ్డ విజయ్ కుమారి సహకరించారు. 2000 సెప్టెంబర్ 4న శ్రీవర్ధని తన పుట్టింటికి ఫోన్ చేసి తనను చంపేలా ఉన్నారంటూ తనను తీసుకెళ్లాలని పుట్టింటి వారిని కోరింది. ఆ తరువాత అర్ధగంటకు ఎవరో ఫోన్ చేసి శ్రీవర్ధని తగలబడిందని చెప్పారు. తండ్రి హేమరాజు మంగళగిరి వెళ్లి తన కూతురు చనిపోయిందని తెలుసుకుని టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి డీఎస్పీ ఎస్.డి.గౌతమ్ దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. వరకట్న వేధింపులు (498ఏ), డౌరీడెత్(304–బి) కింద ముద్దాయిలను శిక్షించాలని చార్జిషీటులో పేర్కొన్నారు.

కేసు కొట్టివేత..

వరకట్న వేధింపులు (498ఏ), డౌరీడెత్(304–బి) కింద నేర నిరూపణ కాకపోవడంతో 2004 నవంబర్ 3వ తేదీన ఐదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు కేసును కొట్టివేసింది.

హైకోర్టు ఆదేశంతో పునఃవిచారణ

కేసు కొట్టివేయడంతో మృతురాలు శ్రీవర్ధని తల్లి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం మర్డర్ (302) కింద చార్జిఫ్రేమ్ చేసి పునఃవిచారణ చేయాలని ఏపీ హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణ చేపట్టగా సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ కాసు వెంకటరెడ్డి వాదించారు.

తుది దశకు సాక్షి ప్రీమియర్ లీగ్

- ఉత్కంఠగా సాగుతున్న ఎస్ పీ ఎల్
- సెమీ ఫైనల్స్‌లో హోరాహోరీగా తలపడిన జట్లు
- నేడు తుదిపోరు

ప్రత్తిపాడు: సాక్షి ప్రీమియర్ లీగ్ తుది దశకు చేరింది. ఎనిమిది రోజులుగా హోరాహోరీగా సాగుతున్న పోటీలు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బుధవారం సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ఫైనల్ పోటీలు నిర్వహించనున్నారు. కాగా ఏడో రోజైన మంగళవారం మూడు మ్యాచ్‌లలో ఒక మ్యాచ్ క్వార్టర్ ఫైనల్స్, రెండు మ్యాచ్‌లు సెమీ ఫైనల్స్‌లో తలపడ్డాయి. మొత్తం ఆరు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఔత్సాహిక క్రికెటర్లను ప్రోత్సహించేందుకు 'సాక్షి మీడియా' గ్రూపు సాక్షి ప్రీమియర్ లీగ్‌ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ కళాశాలలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్‌కు స్పాన్సర్లుగా ఏపీఎండీసీ, వివా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వారు వ్యవహరిస్తున్నారు.

District sponsor

Regional sponsor

నేటి మ్యాచ్‌లు..

- మొదటి మ్యాచ్ చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాల వర్సెస్ జీవీఆర్ అండ్ ఎస్ ఇంజినీరింగ్ కళాశాల (సెమీఫైనల్స్)
- రెండవ మ్యాచ్ విజ్ఞాన్ డిగ్రీ కళాశాల వర్సెస్ ఎస్‌కేఆర్‌బీఆర్ కళాశాల (సీనియర్ ఫైనల్స్)
- మూడవ మ్యాచ్ మొదటి మ్యాచ్ విన్నర్స్ వర్సెస్ కళ్ళం హరనాథ రెడ్డి ఎడ్యుకేషన్ టీం (జూనియర్ ఫైనల్స్)

క్వార్టర్ ఫైనల్స్‌లో జేకేసీ జయకేతనం


గెలుపొందిన క్రీడాకారులు జేకేసీ కళాశాల


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాంబయ్య

మొదటి మ్యాచ్ క్వార్టర్ ఫైనల్లో చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మోతడక వర్సెస్ జేకేసీ కళాశాల జట్లు మధ్య జరిగింది. చలపతి కళాశాల టీం టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ కు దిగిన జేకేసీ కళాశాల టీం నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 74 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన చలపతి టీం 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 54 పరుగులకే పరిమితమైంది. దీంతో జేకేసీ కళాశాల 10 పరుగులతో జయకేతనం ఎగురవేసింది. 2 ఓవర్లలో రెండు పరుగులు మాత్రమే ఇచ్చి, రెండు వికెట్లు తీసిన చలపతి కళాశాలకు చెందిన సాంబయ్యకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గా నిలిచాడు.

ఎస్‌కేఆర్‌బీ ఆర్ డిగ్రీ కళాశాల జయభేరీ..


గెలుపొందిన క్రీడాకారులు ఎస్‌కేఆర్‌బీ ఆర్ కళాశాల


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షాఫక్

సెమీ ఫైనల్స్ లో మొదటి మ్యాచ్ ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల వర్సెస్ ఎస్ కే ఆర్ బీ ఆర్ డిగ్రీ కళాశాల జట్లు మధ్య జరిగింది. ఎస్‌కేఆర్‌బీ ఆర్ డిగ్రీ కళాశాల టీం టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ కు దిగిన జేకేసీ కళాశాల నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 90 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన ఎస్‌కేఆర్‌బీ ఆర్ డిగ్రీ కళాశాల టీం కేవలం ఒకే ఒక్క వికెట్ కోల్పోయి 10 ఓవర్లలో సునాయాసంగా చేసి 91 పరుగులు చేసి 9 వికెట్లతో జయభేరీ మోగించింది. 31 బంతుల్లో రెండు సిక్స్ లు, ఏడు ఫోర్లు తో 57 పరుగులు చేసి బౌండరీల మోత మోగించిన తౌఫిక్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గా నిలిచాడు.

విజ్ఞాన్ ఘన విజయం..


గెలుపొందిన క్రీడాకారులు విజ్ఞాన్ డిగ్రీ కళాశాల


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ జగదీష్

సెమీ ఫైనల్స్ లో రెండవ మ్యాచ్ జేకేసీ కళాశాల వర్సెస్ విజ్ఞాన్ డిగ్రీ కళాశాల జట్లు మధ్య జరిగింది. విజ్ఞాన్ డిగ్రీ కళాశాల టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన జేకేసీ కళాశాల టీం నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 73 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన విజ్ఞాన్ డిగ్రీ కళాశాల 9.2 ఓవర్లలో కేవలం 4 వికెట్లు నష్టానికి 77 పరుగులు చేసి 6 వికెట్లు తో ఘన విజయం సాధించింది. 23 బంతుల్లో 33 పరుగులు చేసిన జగదీష్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గా నిలిచాడు.

గతి శక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్ ప్రారంభం


కార్గో టెర్మినల్‌ను ప్రారంభించిన డివిజన్ డీఆర్‌ఎం రామకృష్ణ, పక్కన సీనియర్ డీఓఎం భాస్కర్‌రెడ్డి

పిడుగురాళ్ల రూరల్/లక్ష్మీపురం: రైలు కార్గోలను నిర్వహించడానికి భారతీయ రైల్వేలు కొత్త గతి శక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్ విధానాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని గుంటూరు రైల్వే డివిజన్ మేనేజర్(డీఆర్‌ఎం) రామకృష్ణ తెలిపారు. స్థానిక పిడుగురాళ్ల– నడికుడి మధ్యలోని తుమ్మల చెరువు స్టేషన్ వద్ద చెట్టినాడ్ సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్(సీసీటీసీ) సౌజన్యంతో మంగళవారం గతి శక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్‌ను డీఆర్‌ఎం రామకృష్ణ, సీనియర్ డీఓఎం భాస్కర్ రెడ్డి, సంస్థ ప్రతినిధులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టెర్మినల్స్ సురక్షితమైన రవాణాను అందించడం ద్వారా మెరుగైన సౌకర్యాలతో రైలు ద్వారా రవాణా కోసం సరుకు రవాణా వస్తువుల నిర్వహణను సులభతరం చేస్తుందన్నారు. ఈ విధానం ప్రకారం కొత్త సైడింగ్‌లు కాకుండా, నిర్మాణంలో ఉన్న ఇప్పటికే ఉన్న ప్రైవేట్ సైడింగ్‌లు, టెర్మినల్ కూడా గతి శక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్‌గా మార్చడానికి వీలుగా ఉంటుందని పేర్కొన్నారు. దీని ప్రకారం చెట్టినాడ్ సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ టెర్మినల్‌ను ప్రారంభించడం అభినందనీయం అన్నారు. ఈ గూడ్స్ టెర్మినల్ గుంటూరు డివిజన్‌లోని పిడుగురాళ్ల–నడికుడి మధ్యలోని తుమ్మల చెరువు స్టేషన్ నుంచి ఈ సేవలు అందిస్తుందన్నారు. సీసీటీసీ టెర్మినల్ తుమ్మల చెరువు రైల్వే స్టేషన్ నుంచి 5.1 కి.మీ దూరంలో ఉందన్నారు. సిమెంట్ క్లింకర్ బాహ్య ట్రాఫిక్‌ను నిర్వహించడానికి ఈ వస్తువుల టెర్మినల్ తెరవబడిందన్నారు. ఈ టెర్మినల్‌లో డీల్ చేయబడే అంతర్గత వస్తువులు బొగ్గు మాత్రమే సీసీటీసీని ప్రారంభిండంతో గతి శక్తి కార్గో టెర్మినల్స్ యజమానులకు అనేక రకాల ప్రయోజనాలు పొందడంతో పాటు సర్వింగ్ స్టేషన్‌కు మొదటి మైలు రవాణా ఖర్చు కాలుష్యం నివారించబడుతుందని చెప్పారు. గతి శక్తి టెర్మినల్స్ ప్రధాన ప్రయోజనాలు ట్రాక్ సిగ్నల్, టెలికం, ఓవర్ హెడ్ పరికరాలు వంటి ఆస్తులు నిర్వహణ కార్యకలాపాలను రైల్వేలు భరించాలని పేర్కొన్నారు. సిబ్బంది ఖర్చులు రైల్వేలు భరిస్తాయని తెలిపారు. మరొక గతిశక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్‌ను సాయి బాలజీ వేర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సౌజన్యంతో తిప్పర్తి స్టేషన్‌లో సేవలందించే విధంగా ఫిబ్రవరి నెలలో ప్రారంభించే అవకాశం ఉందన్నారు. ఈ టెర్మినల్ మిర్యాలగూడ, నల్గొండ, రైల్వే స్టేషన్‌ల మధ్య ఉన్న తిప్పర్తి రైల్వే స్టేషన్ నుంచి కిలోమీటరు దూరంలో ఉందన్నారు. సంవత్సరానికి 3720 టన్నుల ఆహార ధాన్యాలను లోడ్ చేయడం ద్వారా రూ.12 కోట్ల సరుకు రవాణా రాబడిని ఆశించి ఈ టెర్మినల్ నుంచి ఆహార ధాన్యాలు లోడ్ చేయబడతాయన్నారు. కార్యక్రమంలో చెట్టినాడ్ సిమెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతినిధులు, రైల్వే సీనియర్ డీఎస్‌టీఈ సతీష్ శంకర్, సీనియర్ డీఈఈ రవితేజ, ఏసీఎం టి.హెచ్.ప్రసాద్ పాల్గొన్నారు.

సూక్ష్మ పోషకాలు అందేలా చర్యలు

వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ కుర్రి


మాట్లాడుతున్న చైర్మన్ సాయి మార్కొండారెడ్డి

నరసరావుపేట: వ్యవసాయ పరికరాలు, సూక్ష్మ పోషకాలు రైతులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి కోరారు. కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం మంగళవారం నిర్వహించారు. కుర్రి మాట్లాడుతూ రైతులు తమ కమతాలలో నీటి గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో సూక్ష్మ, బిందు సేద్యం ద్వారా పంటలను కాపాడుకోవాలని సూచించారు. ఈ–పంట, ఈకేవైసీ నమోదు వందశాతం పూర్తిచేయాలని చెప్పారు. నర్సరీలు, పురుగుమందుల షాపులను నిరంతరంగా తనిఖీ చేస్తుండాలని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ సూక్ష్మ, బిందు సేద్యంపై రైతులకు అవగాహన కల్పించి వివిధ పంటలపై వాటిల్లే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి రైతులకు అవగాహన కల్పించాలని వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ చిరుధాన్యాలను పెంచే విస్తీర్ణాన్ని పెంచి రైతులకు గిట్టుబాటు ధరను పొందే విధంగా చూస్తామన్నారు. వ్యవసాయ సలహా మండలి సభ్యులు కల్లం విజయభాస్కరరెడ్డి, నల్లూరి సాంబశివరావు పాల్గొన్నారు.

అది ఆత్మహత్య కాదు హత్యే!

- ఆస్తి కోసమే అక్కను హత్య చేసిన తమ్ముడు, అతడి కుమారుడు
- నిందితులకు 14 రోజుల రిమాండ్


సుబ్బాయమ్మ

సంతమాగులూరు (అద్దంకి): మండలంలోని అడవిపాలెం గ్రామంలో గత సంవత్సరం సెప్టెంబరు 21న ఉరి వేసుకుని మృతి చెందినట్లుగా గుర్తించిన గుదె సుబ్బాయమ్మది ఆత్మహత్య కాదని, హత్యేనని విచారణలో వెల్లడైనట్లు సీఐ శివరామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. సంతమాగులూరు పోలీసులు కేసును ఛేదించారని వివరించారు. మంగళవారం నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి అద్దంకి కోర్టులో హాజరు పరచగా వారికి జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు. వివరాలు.. 76 ఏళ్ల వయసున్న మృతురాలు సుబ్బాయమ్మ 40 సంవత్సరాల క్రితం గుంటూరు జిల్లా శావల్యాపురం మండలం కనమర్లపూడిలోని, ఐదో తమ్ముడు పిచ్చయ్యను తీసుకుని వచ్చి పెంచి పెద్ద చేసింది. తనకు చెందిన భూమిలో ఆరు ఎకరాల భూమిని పిచ్చయ్య పిల్లల పేరుతో రాసింది. ఇది ఇలా ఉంటే 2020లో మృతురాలి భర్త మరణించాడు. అప్పటి నుంచి పిచ్చియ్య కుటుంబానికి, పెంచిన మృతురాలి కుటుంబానికి సఖ్యత లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో మృతురాలు తన వద్ద మిగిలి ఉన్న 3.5 ఎకరాల భూమిని మిగిలిన ముగ్గురు తమ్ముళ్ల పేర రాస్తానని, పిచ్చయ్యకు రాయనని చెబుతూ వచ్చింది. ఇక ఆమె ఆస్తి తమకు ఎలాగూ దక్కేలా లేదని భావించిన పిచ్చయ్య తన కుమారుడు రవితేజ సహాయం తీసుకున్నాడు. ఘటన రోజు రాత్రి, అక్కతో ఆస్తివిషయంలో ఘర్షణ పడ్డారు. ఆమె ససేమిరా అనడంతో కొట్టి.. తెల్లకాగితంపై వేలిముద్రలు తీసుకుని, ముఖంపై దిండుతో అదిమి స్పృహ లేకుండా చేశారు. తరువాత ఆమె చీరతో ఉరివేసుకున్నట్లుగా చిత్రీకరించి వెళ్లిపోయారు. పోస్టుమార్టంలో ఆమెది ఆత్మహత్య కాదు.. హత్యేనన్న విషయం వెలుగు చూడటంతో పోలీసులు వారి కదలికలపై నిఘా పెట్టారు. నిందితులు పిచ్చయ్య, అతడి కుమారుడు రవితేజ మంగళవారం అడవిపాలెం గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా లొంగిపోయి, హత్య వివరాలు వెల్లడించారు. సమావేశంలో ఎస్ఐ నాగశివా రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తనుశ్రీ ఎంపిక



సత్తెనపల్లి: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పెదమక్కెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జడ తనుశ్రీ ఎంపికైంది. తిరుపతి ఎస్‌వీ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన అంతర్ జిల్లాల బాలబాలికల అండర్ –19 ఫుట్‌బాల్ పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు నుంచి జడ తను శ్రీ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ అనిల్ దత్త మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జడ తనుశ్రీని పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు వనజ కుమారి అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో మానవాళి మనుగడ



డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను సేకరించడం వలన ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులతో జిల్లా కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతి వనరులను అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతులైన గోమూత్రం, గోపేడ, వేప ఆకులు, స్థానిక వనరులతో మానజీవామృతం, ద్రవజీవామృతం, బీజామృతం, నీమాఅస్త్రం, అగ్నిస్త్రం, బ్రహ్మ అస్త్రం, పంచగవ్య వంటి సాగు విధానాలను పాటించడం వలన నెలలో జీవపదార్థం, భూసారం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎంటీలు జగదీష్, ఓంకార్, మనోజ్, నందకుమార్, సైదయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కందుకూరు డీవైఈఓ గుండెపోటుతో మృతి

కొండపి(ప్రకాశం జిల్లా): కందుకూరు డీవైఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న పి.వెంకటేశ్వర్లు(59) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబంతో కలసి కొండపిలో నివాసం ఉంటున్న ఆయన అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి పొదిలి రోడ్డులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వెంకటేశ్వర్లు కందుకూరు డీవైఈఓ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మర్రిపూడి మండలం తంగెళ్ల హైస్కూల్లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. భార్య మంజూలాదేవితోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రస్తుతం అమెరికాలో ఎంఎస్ చేస్తున్నారు. ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన పల్నాడు జిల్లా ముప్పాళ్ల తరలించారు.